అరకొరగా ఆరు గ్యారెంటీల అమలు

సీపీఎం కేంద్ర కమిటీ సభ్యుడు నాగయ్య విమర్శ

మాట్లాడుతున్న సీపీఎం కేంద్ర కమిటీ సభ్యుడు నాగయ్య

నర్సంపేట, నవంబర్ 30: గత అసెంబ్లీ ఎన్నికల్లో ప్రజలకు ఇచ్చిన హామీల్లో భాగమైన ఆరు గ్యారెంటీలను కాంగ్రెస్ ప్రభుత్వం అరకొరగా అమలు చేస్తున్నదని సీపీఎం కేంద్ర కమిటీ సభ్యుడు జి.నాగయ్య విమర్శించారు. నర్సంపేటలోని సిటిజన్స్ ఫంక్షన్ హాల్‌లో శనివారం సీపీఎం జిల్లా మహాసభల అనంతరం జరిగిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడారు. ఆరు గ్యారెంటీల్లో కేవలం మహిళలకు ఉచిత బస్సు ప్రయాణం మాత్రమే పూర్తిస్థాయిలో అమలవుతున్నదన్నారు. ఇందిరమ్మ ఇళ్ల పథకం ఇప్పటికీ మొదలే కాలేదన్నారు. దళితులకు రూ. 6 లక్షలు, బలహీన వర్గాలకు రూ. 5 లక్షలు ఇస్తామని హామీ ఇచ్చిన పాలకులు.. దాని ఊసే ఎత్తడం లేదని ఎద్దేవా చేశారు. ఎన్నికల సమయంలో 120 గజాల స్థలంలో ఇల్లు నిర్మించి ఇస్తామని చెప్పిన పాలకులు.. ఇప్పుడు 44 గజాల్లోనే నిర్మిస్తామని మాట మార్చారని విమర్శించారు. ప్రస్తుతం స్థలం ఉన్న వారికే ఇల్లు ఇస్తామని అంటున్నారన్నారు. ఇళ్ల స్థలం లేని నిరుపేదలకు ఎప్పుడు ఇండ్లు ఇస్తారో చెప్పాలని ప్రశ్నించారు. రాష్ట్రంలో ఇళ్లు లేని నిరుపేదలు 31 లక్షల మంది ఉన్నారని తెలిపారు. ఇప్పటికే ప్రభుత్వ స్థలాల్లో గుడిసెలు వేసుకొని జీవిస్తున్న వారికి ఇళ్లు ఇవ్వొచ్చని ఇటీవల సీపీఎం ప్రతినిధుల బృందం సీఎం రేవంత్‌రెడ్డిని కలిసిందన్నారు. కానీ, విలువైన స్థలాలు పేదలకు ఇస్తే ఎలా అని దాటవేస్తున్నారని విమర్శించారు. ఇప్పటికైనా కాంగ్రెస్ చిత్తశుద్ధితో ఆరు గ్యారెంటీలను అమలు చేయాలని డిమాండ్ చేశారు. మతతత్వ బీజేపీపై ప్రజలు అప్రమత్తంగా ఉండాలని కోరారు. సమావేశంలో నాయకులు సుదర్శన్‌రావు, రంగన్న,కుమారస్వామి, శ్రీధర్ పాల్గొన్నారు.

నగరంలో మళ్లీ రెచ్చిపోతున్న చైన్ స్నాచర్లు

బైక్‌లపై వచ్చి మహిళల మెడలో నుంచి ఆభరణాల అపహరణ

విచారణ చేస్తున్న ఏసీపీ, సీఐలు

మట్టెవాడ, నవంబర్ 30: వరంగల్ నగరంలో చైన్ స్నాచర్లు మళ్లీ రెచ్చిపోతున్నారు. తాజాగా శనివారం తెల్లవారుజామున మట్టెవాడ ఏసీపీ కార్యాలయం ఎదురుగా ఉన్న గల్లీలోని భోగేశ్వరస్వామి ఆలయం వద్ద ఓదెల ప్రమీల(68) ముగ్గు వేస్తోంది. గుర్తుతెలియని వ్యక్తులు బైక్‌పై వచ్చి మెడలోని బంగారు గొలుసును లాగడంతో వృద్ధురాలు, వారి మధ్య కొదిసేపు పెనుగులాట జరిగింది. ఆమె కిందపడి కేకలు వేయడంతో దొంగలు బంగారు గొలుసు తెంచుకొని బైక్‌పై పారిపోయినట్లు బాధితురాలు తెలిపింది. తీవ్రంగా గాయపడిన ప్రమీలను స్థానికులు ఎంజీఎం ఆసుపత్రికి తరలించారు. మట్టెవాడ పోలీసులు వెంటనే ఘటనా స్థలానికి దర్యాప్తు చేపట్టారు. స్టేషన్‌కు కూతవేటు దూరంలోనే దొంగతనం జరగడంతో పోలీసులు సీరియస్‌గా తీసుకొని విచారణ చేపట్టారు. కాగా, వరంగల్ ఏసీపీ పరిధిలోని మట్టెవాడ, ఇంతేజార్‌గంజ్ స్టేషన్ల పరిధిలోని ముఖ్యమైన ప్రాంతాల్లో చైన్ స్నాచర్లు బంగారం దొంగతనంపైనే దృష్టి పెట్టినట్లు తెలుస్తోంది. కొత్తవాడలో ఓ మహిళ మెడలో నుంచి బంగారు గొలుసును లాకెళ్లిన తీరుగా గోపాలస్వామి గుడి సమీపంలో కూడా మహిళ మెడలో నుంచి బంగారు గొలుసును ఎత్తుకెళ్లారు. తాజాగా చైన్ స్నాచింగ్ అలాగే జరగడంతో నగరవాసులు భయాందోళనకు గురవుతున్నారు. కాగా, చైన్ స్నాచింగ్‌పై కేసు నమోదు చేసినట్లు సీఐ టీ గోపి తెలిపారు. ఘటనా స్థలాన్ని వరంగల్ ఏసీపీ నందిరాంనాయక్, సీఐ పరిశీలించి వివరాలు సేకరించారు.

నమస్తే తెలంగాణ క్లాసిఫైడ్స్

WANTED

jobs Apply Now!

★Wanted Senior Business Development Manager with Hospital Exeperience for a Reputed Hospital. Cont: 9347483888
NTW-000

★Wanted Assistant Doctors, Accountants, Front Office, Executive, Insurance Executives, Lift Boys, for a Reputed Hospital Cont: 9949499959, 7337222112
NTW-000

★Next VV Marketers Private Limted. We are hiring Solar Technicians. Quali: ITI/Diploma, Experience Freshers also can apply. Cont: 9618290901.
NTW-000

CHANGE OF NAME

I, **Botla Hepshiba Rani** (New name) previously called **D. ephceeba Rani** (old name) R/o H.No. 4-6-115/1, Dharmakncha, Jangaon-506167. TG, India and solemnly declare.

RENT

★3 Floors building for Rent, Each Floor has 3600sft. Ground Floor for Parking Place available, Opp: ASM Degree & PG Womens College, Fort Road, Warangal. M: 9849987808/8309884828
NTW-17386

సెప్టిక్ ట్యాంక్ క్లీనర్

SepTeK

★ సెప్టిక్ ట్యాంక్ క్లీనర్ నూతన సాంకేతిక పరిజ్ఞానంతో గల్ఫర్ మిషన్ ద్వారా సెప్టిక్ ట్యాంక్ క్లీన్ చేయబడును. డి.ఎస్. రావు. Cont: 9849145043, 9866584455.
NTW-326503

గమనిక

క్లాసిఫైడ్ ప్రకటనలకు ప్రతిస్పందించే ముందు తగిన రీతిలో క్షుణ్ణంగా విచారించు కోవలసిందిగా పాఠకులకు సూచించడమైనది. ప్రకటనదారు చెబుతున్న లేదా చేసుకుంటున్న క్లెయిములతో నమస్తే తెలంగాణ పత్రికకు ఏ విధమైన సంబంధం లేదు. బ్యాంక్ అకౌంట్ల ద్వారా డబ్బులు ట్రాన్స్‌ఫర్ / డిపాజిట్ చేయవద్దు. పాఠకులు ఈ విషయాన్ని గమనించగలరు.

BUSINESS OFFER

★బియ్యం, ధాన్యం, పప్పు టన్నులు టన్నులు కొంటాం. మాది అతి పెద్ద రైస్ ఎక్స్‌పోర్ట్ బిజినెస్. ధాన్యం, రైస్ వ్యాపారస్తులు & ఆల్ ఫుడ్ ఐటమ్స్ అమ్మేవారు, రైస్ మిల్లర్లు, మీడియేటర్స్, ఈ బిజినెస్‌లో పెట్టుబడి పెట్టే పార్టనర్స్ డైరెక్ట్: 8008251356.
NT-339341-All

నమస్తే తెలంగాణ క్లాసిఫైడ్స్

4 లైన్ల బ్లాక్ అండ్ వైట్ ప్రకటన కేవలం 200/- మాత్రమే

4 లైన్ల బ్లాక్ అండ్ వైట్ 4 ప్రకటనలకు కేవలం 600/- మాత్రమే

ప్రతి అదనపు లైన్‌కు 50/- మాత్రమే

ప్రకటనల విభాగం : 9182777552

HANAMKONDA 9182777563 9182777961

WARANGAL 9182777556

JAYASHANKAR BHUPALPALLY - 9182777559
MULUGU - 9182777135
MAHABUBABAD - 9182777557
JANGAON - 9182777565

ప్రణాళికతో కార్యక్రమాలు నిర్వహించాలి

- నేడు వ్యాసరచన పోటీలు
- కలెక్టర్ సత్య శారద

అధికారులతో మాట్లాడుతున్న కలెక్టర్ సత్య శారద

ఖిలావరంగల్, నవంబర్ 30: ప్రజాపాలన విజయోత్సవాలను జిల్లావ్యాప్తంగా ఘనంగా నిర్వహించాలని కలెక్టర్ సత్య శారద అధికారులను ఆదేశించారు. శనివారం ఆమె తన చాంబర్‌లో అధికారులతో సన్నాహక సమావేశం నిర్వహించారు. విజయోత్సవాల్లో ప్రజాప్రతినిధులను భాగస్వామ్యం చేయాలన్నారు. ఆయా శాఖల అధికారులకు కేటాయించిన తేదీల్లో ప్రణాళికాబద్ధంగా కార్యక్రమాలు నిర్వహించాలన్నారు. రోజువారీ నివేదికల డాక్యుమెంటరీ సమర్పించాలని అధికారులను ఆదేశించారు. ప్రభుత్వ కార్యాలయాలు, జంక్షన్లను విద్యుద్దీపాలతో అలంకరించాలన్నారు. ఆదివారం తెలంగాణ ప్రభుత్వం ఏడాది కాంలో సాధించిన లక్ష్యాలపై విద్యా శాఖ ఆధ్వర్యంలో ప్రాథమిక, ఉన్నత, ఇంటర్, డిగ్రీ కళాశాల్లో వక్తృత్వ, వ్యాసరచన పోటీలు, క్రీడల శాఖ ద్వారా 2కే రన్ నిర్వహించాలన్నారు. సమావేశంలో ఇన్‌చార్జి అదనపు కలెక్టర్ విజయలక్ష్మి, డీఈవో జ్ఞానేశ్వర్, డీఎంహెచ్‌వో డాక్టర్ సాంబశివరావు, డీపీవో కల్పన, డీవైఎస్‌వో సత్యవాణి, అదనపు కమిషనర్ జోనా పాల్గొన్నారు.

రేపు కోటలో..

రాష్ట్ర ప్రభుత్వ ప్రజాపాలన విజయోత్సవాలను కీర్తి తోరణాల మధ్య ఘనంగా నిర్వహించనున్నట్లు కలెక్టర్ ప్రకటనలో తెలిపారు. సోమవారం సాయంత్రం 5 గంటలకు అలేఖ్య రాష్ట్ర కళా బృందంతో జయ జయహే ప్రజాపాలన పేరుతో సాంస్కృతిక కార్యక్రమాలు నిర్వహిస్తున్నట్లు తెలిపారు. ప్రభుత్వ పథకాలు, సాధించిన విజయాలను వివిధ కళారూపాల్లో ప్రదర్శిస్తున్నారని పేర్కొన్నారు. ప్రజలు విజయవంతం చేయాలని కోరారు.

నిరంతర పర్యవేక్షణ ఉండాలి

కాశీబుగ్గ: వరంగల్ ఎనుమాముల వ్యవసాయ మార్కెట్‌లోని గోదాముల్లో భద్రపరిచిన ఈవీఎంలు, వీవీప్యాట్స్‌ను కలెక్టర్ సత్యశారద ఇన్‌చార్జి అదనపు కలెక్టర్ విజయలక్ష్మితో కలిసి తనిఖీ చేశారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ కేంద్ర ఎన్నికల సంఘం ఆదేశాల మేరకు మూడు నెలలకోసారి సాధారణ తనిఖీల్లో భాగంగా పరిశీలించినట్లు తెలిపారు. ఈవీఎంలు భద్రపరిచిన స్ట్రాంగ్ రూమ్ గోదాములకు సంబంధించిన రికార్డులు, కట్టుదిట్టమైన భద్రత చర్యలు, సీసీ కెమెరాల నిరంతర పర్యవేక్షణకు సంబంధించిన వివరాలు అధికారులను కలెక్టర్ అడిగి తెలుసుకున్నారు. సీసీ కెమెరాల నిరంతర పర్యవేక్షణ, పోలీస్ బందోబస్తు పటిష్టంగా ఉండాలన్నారు. కలెక్టర్ వెంట తహసీల్దార్ ఎండీ ఇక్బాల్, నాయబ్ తహసీల్దార్ రంజిత్ ఉన్నారు.

రైతు పండుగకు కలెక్టర్ హాజరు

సంగెం: మండలకేంద్రంలోని రైతువేదికలో జరిగిన రైతు పండుగ కార్యక్రమానికి కలెక్టర్ సత్యశారద శనివారం సాయంత్రం హాజరయ్యారు. ఈ సందర్భంగా మహబూబ్‌నగర్ జిల్లా నుంచి ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి చేసిన ప్రసంగాన్ని వీడియో కాన్ఫరెన్స్ ద్వారా కలెక్టర్ వీక్షించారు. కార్యక్రమంలో జేడీఏ అనురాధ, తహసీల్దార్ రాజ్‌కుమార్, ఏవో యాకయ్య, ఏఈవోలు సాగర్, రాజేందర్, కార్తీక్, రైతులు జనగాం రమేశ్, జగన్నాథచారి, నర్సింహనాయక్, మెట్టుపెల్లి రమేశ్ పాల్గొన్నారు.

పశుసంపదతోనే రైతుల అభివృద్ధి

వర్ధన్నపేట, నవంబర్ 30: రైతులు పాడి సంపదను పెంచుకుంటే ఆర్థికాభివృద్ధి సాధిస్తారని కేవీకే శాస్త్రవేత్త డాక్ట్ రాజన్న అన్నారు. మామునూరులోని కృషి విజ్ఞాన కేంద్రం, పీవీ నర్సింహారావు తెలంగాణ పశువైద్య విశ్వవిద్యాలయం, పశుసంవర్ధక శాఖ ఆధ్వర్యంలో శనివారం చంద్రుతండాలో ప్రత్యేక పశువైద్య శిబిరం ఏర్పాటు చేశారు.

నిత్యాన్నదానం ప్రారంభం

కాశీబుగ్గ, నవంబర్ 30: కాశీబుగ్గ రాములవారి వీధిలోని సీతా రామాంజనేయ అయ్యప్పస్వామి ఆలయంలో శనివారం అయ్యప్ప స్వాములకు నిత్యాన్నదాన కార్యక్రమాన్ని ప్రారంభించారు.

రైతులు లేకుండానే పండుగ!

బోసిబోయిన బొల్లికుంట రైతు వేదిక

సీఎం ప్రసంగం వింటున్న అధికారులు, డైరెక్టర్లు

ఖిలావరంగల్, నవంబర్ 30: మండలంలోని బొల్లికుంట రైతు వేదికలో శనివారం రైతులు లేకుండానే రైతు పండగ నిర్వహించారు. వానకాలం పంటకు రైతు భరోసా ఇవ్వకపోవడం, అర్హులకు రుణమాఫీ కాకపోవడంతో అన్నదతలు ప్రభుత్వానికి షాక్ ఇచ్చారు. రైతులను ఆదుకోవడంలో కాంగ్రెస్ ప్రభుత్వం విఫలమైందని ఆగ్రహిస్తూ రైతులు వేదిక పైపు కన్నెత్తి చూడలేదు. దీంతో రైతుల కోసం వేసిన కుర్చీలు ఖాళీగా దర్శనమిచ్చాయి. మహబూబ్‌నగర్ నుంచి సీఎం రేవంత్‌రెడ్డి ప్రసంగాన్ని వీక్షించేందుకు అధికారులు రైతు వేదికల వద్ద లైవ్ ఏర్పాటు చేశారు. అయితే, సీఎం ప్రసంగం ప్రారంభం నుంచి ముగింపు వరకు లైవ్‌ను పీఏసీఎస్ చైర్మన్, వైస్ చైర్మన్, డైరెక్టర్లు, వ్యవసాయ శాఖతోపాటు అనుబంధ శాఖల అధికారులు మాత్రమే వీక్షించారు. ఇదిలా ఉంటే.. ఖిలావరంగల్‌లో ఉన్న మరో రైతు వేదిక వద్ద అధికారులు ఏర్పాట్లు చేయలేదు. కనీసం రైతు వేదిక తాళం కూడా తీయకపోవడం కాంగ్రెస్ ప్రభుత్వ పని తీరుకు నిదర్శనమని రైతులు వ్యంగ్యాస్త్రాలు సంధించారు. రైతు పండుగ, మన పండుగ, రైతు విజయోత్సవాలకు ఖిలావరంగల్ మండల రైతులు దూరంగా ఉండడం గమనార్హం.

ప్రవీణ్‌కుమార్‌కు మంత్రి క్షమాపణ చెప్పాలి: బీఆర్ఎస్

సమావేశంలో మాట్లాడుతున్న బీఆర్ఎస్ నేతలు

వర్ధన్నపేట, నవంబర్ 30: ఐపీఎస్ అధికారిగా బడుగు బలహీన వర్గాల పిల్లల సంక్షేమం కోసం విశేషంగా కృషి చేసిన ఆర్ఎస్ ప్రవీణకుమార్‌పై అనుచిత వ్యాఖ్యలు చేసిన రాష్ట్ర అటవీ, దేవాదాయ శాఖ మంత్రి కొండా సురేఖ వెంటనే క్షమాపణ చెప్పాలని మాజీ జడ్పీటీసీ మార్గం భిక్షపతి, బీఆర్ఎస్ నాయకులు మంద అశోక్, తూళ్ల కుమారస్వామి, ఎండీ.రహీం డిమాండ్ చేశారు. పట్టణంలో శనివారం ఏర్పాటు చేసిన సమావేశంలో వారు మాట్లాడారు. రాష్ట్రంలోని సోషల్ వెల్ఫేర్ గురుకుల విద్యార్థుల సంక్షేమం కోసం కృషి చేసిన ప్రవీణ్‌కుమార్‌ను మంత్రి రౌడీషీటర్‌గా పేర్కొనడం సరికాదన్నారు. రాష్ట్ర ప్రజలకు రౌడీషీటర్లు ఎవరో తెలుసునని ఎద్దేవా చేశారు. మెరుగైన పాలన అందించలేని మంత్రులు రాష్ట్రంలో డైవర్షన్ రాజకీయాలు చేస్తున్నారని విమర్శించారు. కాంగ్రెస్ పార్టీపై ప్రజల్లో వస్తున్న వ్యతిరేకతను కప్పిపుచ్చుకునేందుకు బీఆర్ఎస్‌పై అర్థంలేని ఆరోపణలు చేస్తున్నారని ధ్వజమెత్తారు. మంత్రి సురేఖ క్షమాపణ చెప్పకపోతే గ్రామాల్లో తిరగకుండా అడ్డుకుంటారని హెచ్చరించారు. సమావేశంలో బీఆర్ఎస్ నాయకులు వేణుగోపాల్‌రావు, వెంకట్‌రెడ్డి, వసంత్‌నాయక్, వీరస్వామి పాల్గొన్నారు.

కాంగ్రెస్ పాలనలో సర్కారు బడుల్లో పుడ్ పాయిజన్

- విద్యార్థులు చనిపోతున్నా పట్టించుకోని ప్రభుత్వం
- వామపక్ష విద్యార్థి సంఘాల నాయకులు

నిరసన తెలుపుతున్న విద్యార్థి సంఘాల నేతలు

కరీమాబాద్, నవంబర్ 30: కాంగ్రెస్ ఏడాది పాలనలో తెలంగాణవ్యాప్తంగా ప్రభుత్వ విద్యా సంస్థల్లో 38 సార్లు పుడ్ పాయిజన్ ఘటనలు జరిగాయని, అయినా ప్రభుత్వం స్పందించకపోవడం సిగ్గుచేటని వామపక్ష విద్యార్థి సంఘాల నాయకులు ధ్వజమెత్తారు. రాష్ట్రవ్యాప్తంగా జరుగుతున్న పుడ్ పాయిజన్ ఘటనలకు నిరసనగా చేపట్టిన బంద్‌లో భాగంగా శంభునిపేట ప్రభుత్వ పాఠశాలలో శనివారం నిరసన తెలిపారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ కాంగ్రెస్ పాలనలో విద్యా వ్యవస్థ అస్తవ్యస్తంగా మారిందని విమర్శించారు. విద్యార్థులు ఆత్మహత్యలు చేసుకుంటున్నారని ఆందోళన వ్యక్తం చేశారు. పుడ్ పాయిజన్‌తో ప్రాణాలు సైతం కోల్పోతున్నారని ఆవేదన వ్యక్తం చేశారు. పిల్లల జీవితాలు, ప్రాణాలతో చెలగాటం ఆడుతున్న ప్రభుత్వానికి తగిన బుద్ధి చెప్పాలని పిలుపునిచ్చారు. కార్యక్రమంలో వామపక్ష విద్యార్థి సంఘాల నాయకులు పాల్గొన్నారు.

పాఠశాలల బంద్ విజయవంతం

నర్సంపేట: రాష్ట్రంలోని గురుకుల పాఠశాలల్లో జరుగుతున్న పుడ్ పాయిజన్ ఘటనలను నిరసిస్తూ శనివారం వామపక్ష విద్యార్థి సంఘాల ఆధ్వర్యంలో చేపట్టిన బంద్ పట్టణంలలో విజవయంతమైంది. ఈ సందర్భంగా ఎస్ఎఫ్ఐ(యూ) రాష్ట్ర ఉపాధ్యక్షుడు మొగిలిచర్ల సందీప్, పీడీఎస్‌యూ జిల్లా అధ్యక్షుడు అలువాల నరేశ్ మాట్లాడుతూ కాంగ్రెస్ ప్రభుత్వం ఏర్పడిన ఏడాది కాలంలో రాష్ట్రంలోని గురుకులాల్లో 51 మంది విద్యార్థులు చనిపోయారని ఆరోపించారు. విద్యార్థులకు నాణ్యమైన భోజనం అందిచకపోవడం, విద్యాశాఖ అధికారులు పర్యవేక్షించకపోవడం వల్లే ఇలాంటి ఘటనలు పునరావృతమవుతున్నట్లు పేర్కొన్నారు. కార్యక్రమంలో వామపక్ష విద్యార్థి నాయకులు సమ్మెట వెర్షన్, కాంత్రి, కుమార్, సురేశ్, హరిప్రసాద్ పాల్గొన్నారు.

వికటించిన ఆర్ఎంపీ వైద్యం.. ఊడిపోతున్న చర్మం

ఆర్ఎంపీ అందించిన చికిత్స వల్ల ఊడిపోయిన చర్మం

ఖిలావరంగల్, నవంబర్ 30: ఆర్ఎంపీ వైద్యం వికటించడంతో బాధితుడి చర్మం ఊడిపోతున్న ఘటన కోటలో జరిగింది. తెలంగాణ మెడికల్ కౌన్సిల్ పబ్లిక్ రిలేషన్ కమిటీ చైర్మన్ డాక్టర్ నరేశ్‌కుమార్ కథనం ప్రకారం.. ఖిలావరంగల్‌కు చెందిన ఇతనేని సూరయ్య(70)కు జ్వరం రావడంతో గత నెల 25న ఆర్ఎంపీ జీ రామకృష్ణను సంప్రదించాడు. అతడు పరీక్షించి కొన్ని మందులు ఇచ్చాడు. మరుసటి రోజు ఉదయం చర్మంపై మంట, దురద ఉందని ఆర్ఎంపీని సంప్రదించగా మరికొన్ని మాత్రలు ఇచ్చాడు. అవి వాడగా చర్మం ఊడిపోతున్నది. మరోసారి సంప్రదించగా చర్మవ్యాధి నిపుణుడి వద్దకు వెళ్లాలని సూచించాడు. దీంతో కుటుంబ సభ్యులు వృద్ధుడిని గత నెల 27న వరంగల్‌లోని ఓ ప్రైవేట్ దవాఖానలో చేర్పించారు. ఆర్ఎంపీ ఇచ్చిన మందుల రియాక్షన్ వల్లే చర్మంపై బొబ్బలు వచ్చాయని వైద్యులు నిర్ధారించి చికిత్స అందిస్తున్నారు. రామకృష్ణపై చర్యలు తీసుకోవాలని వృద్ధుడి మనవడు వంశీకృష్ణ వైద్య మండలికి వినతిపత్రం అందజేశాడు.

'రూ. 5 భోజనం అందించాలి'

కరీమబాద్, నవంబర్ 30: ఉర్సు బైపాస్ రోడ్డులోని ప్రభుత్వ స్థలంలో ఖిలావరంగల్ తహసీల్దార్ కార్యాలయం నిర్మించడంతోపాటు ఉర్సు దర్గా వద్ద రూ. 5 భోజనం క్యాంటీన్ ఏర్పాటు చేయాలని ఉర్సుకు చెందిన గడ్డం యుగేంధర్‌గౌడ్, నాగపురి క్రాంతి కోరారు. ఈ మేరకు శనివారం ఆయన మంత్రి కొండా సురేఖకు కలిసి వినతిపత్రం అందజేశారు.

అంగన్‌వాడీ పిల్లలకు దుస్తుల పంపిణీ

పోచమ్మమైదాన్, నవంబర్ 30: అసోసియేషన్ ఆఫ్ అలయన్స్ ఇంటర్నేషనల్ కమిటీ చైర్మర్ డాక్టర్ మంత్రి లింగమూర్తి జన్మదినం సందర్భంగా అలయన్స్ కొత్తవాడలోని అంగన్‌వాడీ కేంద్రంలో శనివారం పిల్లలకు దుస్తులు పంపిణీ చేశారు. ఓంకార్, కుమార్, లక్ష్మణ్, రవి, దస్తగిర్, సతీశ్ పాల్గొన్నారు.

300 మందికి వైద్య పరీక్షలు

గిర్మాజీపేట, నవంబర్ 30: తొమ్మిదో ఆయుర్వేద దినోత్సవ వేడుకల్లో భాగంగా శనివారం ఆయుర్వేద బోధనాసుపత్రి, అనంతలక్ష్మి ప్రభుత్వ ఆయుర్వేద వైద్య కళాశాల, వయోవృద్ధుల సంక్షేమ సంస్థ ఆధ్వర్యంలో బట్టలబజార్‌లో వైద్య శిబిరం నిర్వహించారు. ఈ సందర్భంగా సుమారు 300 మందికి వైద్య పరీక్షలు చేసిన ఉచితంగా మందులు పంపిణీ చేశారు.

దాడి ఘటనలో ఒకరి మృతి

పర్వతగిరి, నవంబర్ 30: మద్యం మత్తులో దాడి చేసిన ఘటనలో ఒకరు మృతి చెందారు. స్థానికుల కథనం ప్రకారం.. పెద్దతండాకు చెందిన బానోత్ వెంకన్న మద్యం మత్తులో గోర్కాటి చేరాలు(50)పై దాడి చేశాడు. దీంతో తీవ్రంగా గాయపడిన అతడు మృతి చెందినట్లు సీఐ రాజగోపాల్ తెలిపారు.

బాధిత కుటుంబాన్ని పరామర్శిస్తున్న రవీందర్‌రావు

బాధిత కుటుంబానికి తక్కళ్లపల్లి పరామర్శ

రాయపర్తి, నవంబర 30: కొండూరుకు చెందిన తెలంగాణ ఉద్యమకారుడు, బీఆర్ఎస్ నేత పోల్నేని శ్యామ్‌సుందర్‌రావు ఇటీవల అకాల మరణం చెందాడు. ఈ మేరకు ఎమ్మెల్సీ తక్కళ్లపల్లి రవీందర్‌రావు గ్రామానికి వెళ్లి బాధిత కుటుంబాన్ని పరామర్శించారు. తెలంగాణ మహోద్యమంలో ఆయన సేవలను గుర్తుచేసుకున్నారు. తక్కళ్లపల్లి వెంట బీఆర్ఎస్ మండల నాయకులు కర్ర రవీందర్‌రెడ్డి, వీరమనేని సత్యనారాయణరావు, నాగండ్ల భాస్కర్, పులి సోమయ్య గౌడ్, గజ్జి వెంకన్న, కాశబోయిన యాకన్న ఉన్నారు.

జ్వాలా తోరణాన్ని వెలిగిస్తున్న తహసీల్దార్ ఇక్బాల్

ఘనంగా అనంతకోటి దీపోత్సవం

వరంగల్‌చౌరస్తా, నవంబర్ 30: కార్తికమాసం చివరి శనివారాన్ని పురస్కరించుకొని గోవిందరాజ స్వామి ఆలయ గోశాలలో అనంతకోటి దీపోత్సవాన్ని ఘనంగా నిర్వహించారు. ముఖ్య అతిథిగా హాజరైన వరంగల్ తహసీల్దార్ ఇక్బాల్‌కు అనువంశీయ అర్చకుడు వరమోగుల శ్రీనివాసస్వామి పూర్ణకుంభ స్వాగతం పలికారు. అనంతరం ప్రత్యేక పూజా కార్యక్రమాలు నిర్వహించి, అనంతకోటి దీపాలు, జ్వాలా తోరణాన్ని వెలిగించారు. కార్యక్రమంలో ఇంతేజార్ గంజ్ సీఐ ఎంఏ షూకుర్, ఆలయ అభివృద్ధి కమిటీ ప్రతినిధులు, డివిజన్ నేతలు, మహిళలు పాల్గొన్నారు.

కళావేదిక పైకప్పు ఏర్పాటుకు సహకారం

దుగ్గొండి, నవంబర్ 30: మండలకేంద్రంలోని జడ్పీహెచ్ఎస్‌లో కళావేదిక పైకప్పును బెస్ట్ రన్నర్ ప్రతినిధులు రూ. 1.20 లక్షల ఆర్థిక సహకారంతో నిర్మించారు. ఈ సందర్భంగా శనివారం కళావేదికను ప్రారంభించారు. అనంతరం పాఠశాల ఆవరణలో సంస్థ ప్రతినిధులు మొక్కలు నాటారు. దాతలు ముక్క శ్రీనివాస్, ముక్క రమేశ్, వీరేశలింగం, ముక్క నిఖిల్‌ను హెచ్ఎం ఎ.రామస్వామి, టీచర్లు సన్మానించారు.

గ్రేడ్-2 అధికారిగా ఇల్లంద యువకుడు

వినయ్

వర్ధన్నపేట, నవంబర్ 30: టీజీపీఎస్‌సీ ప్రకటించిన ఫలితాల్లో మండలంలోని ఇల్లందకు చెందిన కొంగ వినయ్ గ్రేడ్-2 అధికారిగా ఎంపికయ్యాడు. శుక్రవారం విడుదలైన ఫలితాల్లో వినయ్ గ్రేడ్-2 డివిజనల్ అంకౌంట్స్ ఆఫీసర్‌గా ఎంపికయ్యాడు.

భర్తను హతమార్చిన భార్య

సునీల్(ఫైల్)

గీసుగొండ, నవంబర్ 30: వేధింపులకు గురిచేస్తున్నాడనే నెపంతో ఓ భార్య తన కూతురి సహకారంతో భర్తపై పెట్రోల్ పోసి నిప్పటించి హత మార్చిన ఘటన మండలంలోని శాయంపేటలో శుక్రవారం రాత్రి జరిగింది. సీఐ మహేందర్ కథనం ప్రకారం.. గ్రామానికి చెందిన కోటగిరి సునీల్(36) పన్నెండేళ క్రితం హనుమకొండ జిల్లా దామెర మండలం ఊరుగొండకు చెందిన మేకల లక్ష్మిని ప్రేమ వివాహం చేసుకున్నాడు. లక్ష్మికి ఇది రెండో వివాహం. మొదటి భర్తకు పుట్టిన కుమార్తె సిరి ఉంది. తర్వాత సునీల్, లక్ష్మి దంపతులకు కుమారుడు జన్మించాడు. నలుగురు కలిసి గ్రామంలో నివాసముంటున్నారు. సిరి కొద్ది రోజులుగా ఓ అబ్బాయితో ఫోన్‌లో మాట్లాడుతున్నట్లు సునీల్‌కు తెలిసింది. దీంతో నాలుగు రోజుల క్రితం లక్ష్మి, సిరిని సునీల్ కొట్టాడు. బంధువులు కలుగజేసుకొని శుక్రవారం సర్దిచెప్పి వెళ్లిపోయారు. అదే రోజు రాత్రి సునీల్ నిద్రించగా.. లక్ష్మి సిరితో కలిసి అతడిపై పెట్రోల్ పోసి నిప్పటించి బయటకు వచ్చి తలుపులు వేశారు. అతడి ఆర్తనాదాలు విన్న చుట్టుపక్కల వారు వచ్చి తలుపులు తెరిచి అంబులెన్స్‌లో ఎంజీఎం దవాఖానకు తరలించారు. ఈ క్రమంలో చికిత్స పొందుతూ శనివారం ఉదయం మృతి చెందాడు. సునీల్ సోదరి నీరజ ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు సీఐ తెలిపారు. ఘటనా స్థలాన్ని మామునూరు ఏసీపీ తిరుపతి పరిశీలించారు.

అవగాహన కల్పిస్తున్న డీఆర్వో రీనా

అడవులకు నిప్పు పెట్టడం సరికాదు

ఖానాపురం, నవంబర్ 30: అడవులకు నిప్పు పెట్టడం సరికాదని డీఆర్వో రీనా అన్నారు. పాకాలలో అటవీశాఖ ఆధ్వర్యంలో ఫైర్ మేనేజ్‌మెంట్‌పై శనివారం అవగాహన కల్పించారు. అడవుల్లో బీడీలు, సిగరెట్లు కాల్చి వేయడం వల్ల మంటలు అంటుకుని కాలిపోయే ప్రమాదం ఉందని రీనా అన్నారు. అంతేకాకుండా అడవులు అంటుకోవడం వల్ల వన్యప్రాణులు అంతరించిపోయే ప్రమాదం ఉందని వివరించారు. అడవులను కాపాడుకోవాల్సిన బాధ్యత మనందరిపై ఉందని గుర్తుచేశారు.

ఆర్టీసీ సిబ్బందికి భోజనం వడ్డిస్తున్న అధికారులు

ఆర్టీసీ డిపోలో కార్తిక వనభోజనాలు

నర్సంపేట, నవంబర్ 30: టీఎస్ ఆర్టీసీ ఎండీ సజ్జనార్ పిలుపు మేరకు నర్సంపేట డిపో ఆర్టీసీ ఉద్యోగులు శనివారం కార్తిక వనభోజనాల కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆర్టీసీ వరంగల్ రీజినల్ డిప్యూటీ మేనేజర్ కేశరాజు భానుకిరణ్, డిపో మేనేజర్ ప్రసూనలక్ష్మి ఆధ్వర్యంలో ఉద్యోగులు కుటుంబ సభ్యులతో హాజరై ఆటపాటలతో ఆలరించారు. పోటీల్లో గెలుపొందిన వారికి డిపో మేనేజర్ బహుమతులు అందజేశారు. కార్యక్రమంలో డిపో అసిస్టెంట్ మేనేజర్ భవాని, ప్రభాకర్, సూర్యనారాయణ, నర్సింగరావు, బాబురావు, కిశోర్, శశిధర్, సాంబయ్య పాల్గొన్నారు.